క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ మన్సూరాబాద్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు. 11కేవీ సిరీస్ ఫీడర్ పరిధిలోని కాలనీల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు. 11కేవీ సౌత్‌ఎండ్ పార్క్ ఫీడర్ పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

గ్రామాల విలీనం హర్షణీయం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం తుక్కుగూడ మున్సిపాలిటీలో హర్షగూడ గ్రామాన్ని విలీనం చేయడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపాలిటీ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఓఆర్ఆర్ పరిధిలోని 51 గ్రామాలను సమీప మున్సిపాలిటీలో కలుపుతూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసిందన్నారు. గ్రామాలు మున్సిపాలిటీలో విలీనం కావడంతో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. విలీనం చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

భారతీయ కిసాన్ సంఘ్ మండల కమిటీ ఎన్నిక



కమిటీతో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర నాయకులు

కందుకూరు: భారతీయ కిసాన్ సంఘ్ మండల కార్యవర్గాన్ని బుధవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడిగె గజేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా సురసాని సీతారెడ్డి, కార్యదర్శిగా బుడ్డోల్ల ఈశ్వరయ్య, ఉపాధ్యక్షులుగా కృష్ణగౌడ్, గంగుల రవీందర్‌రెడ్డి, కోశాధికారిగా సురసాని యాదగిరిరెడ్డి, ఉపకార్యదర్శిగా చిట్టె లక్ష్మణ్, సలహాదారులుగా సురసాని వెంకటరెడ్డి, సునీల్‌కుమార్‌మిశ్రా, కార్యవర్గ సభ్యులుగా పాశం శ్రీనివాస్, బద్దుల రమేశ్, చంద్రశేఖర్‌రెడ్డిని ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్యాంసుందర్‌రెడ్డి, నర్సింహగౌడ్, జిల్లా కార్యదర్శి నోముల గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

‘మదర్’ డైరెక్టర్ పదవికి నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న రాంరెడ్డి తదితరులు

కందుకూరు: ఉమ్మడి నల్గొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార యూనియన్(మదర్ డెయిరీ) డైరెక్టర్ పదవికి జిల్లా తరపున మండల పరిధిలోని ఆకులమైలారంకు చెందిన ఎడ్ల రాంరెడ్డి బుధవారం మద్దతుదారులతో కలిసి హయత్‌నగర్‌లోని కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట మదర్ డెయిరీ సంఘం ప్రతినిధులు చేగూరి బీరప్ప, ఎండీ వహీద్, బుచిర్రెడ్డి, సంజీవరెడ్డి, ఊట్లపల్లి కృష్ణయ్య, అరుణ, సుగుణమ్మ, నాయకులు అండేకార్ సురేందర్, రావుల జంగయ్య, గౌర శ్రీశైలం, బూచిరెడ్డి రాజేందర్‌రెడ్డి, ఎడ్ల ప్రభాకర్‌రెడ్డి, అచ్చన శ్రీనివాస్, ఎడ్ల అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆటోలో మర్చిపోయిన నగదు అందజేత

హస్తినాపురం: ఆటోలో ప్రయాణిస్తూ మర్చిపోయిన నగదు ఉన్న బ్యాగును తిరిగి అప్పగించిన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సచివాలయనగర్‌లో ఒక మహిళ ఆటోలో ప్రయాణిస్తున్న సమయంలో తనతో పాటు తీసుకువచ్చిన నగదు బ్యాగును మరిచిపోయింది. మంగళవారం సాయంత్రం బాధితురాలు ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాల సహాయంతో ఆటోను గుర్తించి అందులో ఉన్న బ్యాగుతో పాటు రూ. 15వేలు, సెల్‌ఫోన్ ఇతర వస్తువులను బుధవారం ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి అందజేశారు.

50 పడకల ఆస్పత్రిగా మార్చండి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి
- మహేశ్వరం సీహెచ్‌సీ పరిశీలన



ఆస్పత్రిలో నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: మండల కేంద్రంలోని సీహెచ్‌సీ(కమ్యూనిటీ హెల్త్ సెంటర్)ని 30 నుంచి 50 పడకలకు మార్చాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మహేశ్వరం ప్రభుత్వ ఆస్పత్రిని ఆమె పరిశీలించి రోగులు, వైద్యులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రికి అన్ని సౌకర్యాలు అందాయన్నారు. 2022లో 30 పడకల నుంచి 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం 50 పడకల ఆస్పత్రిగా మార్చి, మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఆస్పత్రిలో వైద్యుల పోస్టులు పెంచి, స్త్రీలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సతో పాటు అన్ని సేవలు అందించాలన్నారు. ఆస్పత్రిలో బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి తప్పా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పనులు కన్పించడం లేదని ఆరోపించారు. విమర్శలు మానేసి అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాలని ప్రభుత్వానికి సూచించారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

అనంతరం ఆస్పత్రిలో జరుగుతున్న నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ అమీర్ సిద్ధిఖీ, పీఏసీఎస్ చైర్మన్ పాండు, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎంఆర్ఎఫ్

మహేశ్వరం: సీఎం సహాయ నిధి పథకాన్ని అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశం హాల్‌లో 99 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ పేదలకు వరంలాంటిదన్నారు. పేదలకు అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స చేసుకునేందుకు సీఎం సహాయ నిధి ఉపయోగపడుతుందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండుయాదవ్, వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ శైలజ, ఆర్ఐ స్వర్ణకుమారి, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, పీఏసీఎస్ డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మంత్రాల చెరువు వద్ద లైట్లు ప్రారంభం

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి మంత్రాల చెరువు సుందరీకరణలో భాగంగా రూ.1 కోటి రూపాయల హెచ్ఎండీఏ నిధులతో ఏర్పాటు చేసిన లైట్లను బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. నియోజకవర్గంలోని చెరువులను రక్షించడంతో పాటు సుందరీకరించి ప్రజలకు ఆహ్లాదం పంచేలా ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి చేశామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి చేసిన చెరువులను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత స్థానిక ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్‌చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కమిషనర్ జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాస్, కార్పొరేటర్లు మల్లేశ్ ముదిరాజ్, సిద్దాల లావణ్య, బీఆర్ఎస్ అధ్యక్షులు అర్కల కామేశ్‌రెడ్డి, ధరంకార్ కిషోర్, మాదరి రమేశ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

గురుకులాల్లో వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

బడంగ్‌పేట్: వేల సంవత్సరాల నుంచి నెట్టివేయబడ్డ పిల్లలు గురుకులాల్లో చదువుకుంటుంటే వారి ఆలనా పాలనను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని బడంగ్‌పేట కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ఇబ్రాం శేఖర్ ఆవేద కౌన్సిల్ మీటింగ్‌లో వినాయకచవితి ఉత్సవాలకు రూ.1.15 కోట్లు కేటాయిస్తే న వ్యక్తం చేశారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన బడంగ్‌పేట కార్పొరేషన్‌తనతో పాటు సభ్యులందరం స్వాగతించి ఆమోదం తెలిపామన్నారు. అయితే బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని గురుకుల స్కూళ్లు, కాలేజీలు, పాలిటెక్నిక్ కాలేజీ, డిగ్రీ కాలేజీలు ఉన్నాయని, అందులో చదువుతున్న పేద విద్యార్థులకు వసతుల విషయంలో మాత్రం ఎందుకు ఈ కార్పొరేషన్ పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. బడంగ్‌పేట కార్పొరేషన్ కూడా విద్యార్థుల వసతుల కోసం నిధులు కేటాయించాలని స్థానిక ఎమ్మెల్యే, మేయర్, కార్పొరేటర్లను విజ్ఞప్తి చేశారు. టాయిలెట్లు, బాత్‌రూమ్‌లు, కిటికీలు లేక నేలపై పడుకుంటున్న విద్యార్థులను పట్టించుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్ల నిర్వహణకు బడంగ్‌పేట వీరాంజనేయ భక్త సమాజం లక్ష కేటాయించడం, అలాగే బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి రూ.5 లక్షలు ఇస్తామని ఒప్పుకోవడం శుభపరిణామన్నారు. ప్రభుత్వ బడులు, హాస్టళ్లు, గురుకులాలు, కాలేజీలల్లో వసతుల కల్పనకు అందరూ ముందుకురావాలని పిలుపునిచ్చారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మహేశ్వరం: మండల పరిధిలోని పెండ్యాల గ్రామంలో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు బుధవారం పాఠశాలలో సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులందరూ ఒకచోట కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం పాఠశాలలో పని చేసిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అస్రజాహుర్, సూజత, రాజు, కృష్ణయ్య, సునిత, వెంకట్రామిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నిర్మల, ఇందిరా ప్రశాంతి, చూడామణి, మాధవి, పూర్వ విద్యార్థులు స్వప్న, కామాక్షి, శిరీష, వినోద్, పూజ, శ్వేత, శాలిని, లక్ష్మణ్ పలువురు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీలో ప్రాధాన్యమివ్వండి



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

యాచారం: ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి వైస్ చైర్మన్ పదవీని యాచారం మండలానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ యాదవ్‌కు ఇవ్వాలని బుధవారం మండల కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఇబ్రహీంపట్నంలోని క్యాంపు కార్యాలయంలో మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి తదితర కాంగ్రెస్ బృందం ఎమ్మెల్యేను కలిసి వ్యవసాయ మార్కెట్ కమిటీని త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలో పార్టీ శ్రేణులతో సమావేశమై మార్కెట్ కమిటీకి నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. యాచారం మండలానికి ప్రాధాన్యత కల్పిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గురునాథ్‌రెడ్డి, లక్ష్మీపతిగౌడ్, లక్ష్మారెడ్డి, శేఖర్‌గౌడ్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జ్వరం.. జరభద్రం..!

- గ్రామాల్లో పెరుగుతున్న బాధితుల సంఖ్య
- జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్న వైద్య సిబ్బంది



ఆరుట్లలో రోగి ఆరోగ్య సమస్య తెలుసుకుంటున్న డాక్టర్ దీప్తి (ఫైల్)

మంచాల: గ్రామాల్లో వర్షాలతో విషజ్వరాలు ప్రబలే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే ఆర్ఎంపీ, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వద్దకు రోగులు పెద్ద ఎత్తున్న వైద్యం కోసం వెళ్తున్నారు. మంచాల మండలంలో మంచాల, ఆరుట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. సాధరణ రోజుల్లో కంటే వర్షాలతోనే జ్వరం, ఒళ్లు నొప్పులు వంటి సమస్యలతో ఎక్కువగా వస్తున్నారు. మంచాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోజుకు 70నుంచి 80 మంది రోగులు వైద్యం కోసం వస్తున్నారు. ఆరుట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సాధారణ రోజుల్లో కంటే వర్షాల అనంతరం 60 నుంచి 100కు రోగుల సంఖ్య పెరిగింది. జిల్లా అధికార యంత్రాంగం సూచన మేరకు గ్రామాల్లో జ్వరాల బారీన పడకుండా పలు జాగ్రత్తలు సూచిస్తున్నారు. జ్వర పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు. ఆరుట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఇప్పటి వరకు 165 కేసులు నమోదయ్యాయి. రెండు, మూడు రోజుల్లో రోగుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్య బృందం పేర్కొంటుంది.

వసతి గృహాల్లో క్యాంపులు

మండలంలోని వసతి గృహాలను అధికారులు సందర్శించి విద్యార్థుల ఆరోగ్య సమస్యలను తెలుసుకుంటున్నారు. మంచాల బీసీ బాలికల వసతి గృహం, రంగాపూర్ ఎస్టీ బాలికల వసతి గృహం, ఆరుట్లలోని ఎస్సీ బాలుర వసతి గృహం, ఆదర్శ పాఠశాల వసతి గృహాలను సందర్శించారు. విద్యార్థులను కలిసి ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరాల బారీన పడిన వారికి మందులు కూడా పంపిణీ చేశారు.

పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న న్యూట్రిషన్ బృందం

మాడ్గుల: ప్రతిరోజు పోషకవిలువలతో కూడిన ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉండొచ్చని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ హైదరాబాద్ బృందం పేర్కొన్నారు. పోషణ్ మాస్ జాతీయ పోషకాహార మాసోత్సవాలు సందర్భంగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ హైదరాబాద్ బృందం బుధవారం ఇర్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికల శారీరక మానసిక ఎదుగుదలకు పోషకాల ప్రాధాన్యత, రోజువారిగా తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు, కిషోర బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలు, యువతుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి చేపడుతున్న ఒక గొప్ప కార్యక్రమమన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ బృందం సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, భవ్యశ్రీ, నాగజ్యోతి, శిరీష, శశి, ప్రధానోపాధ్యాయులు పర్వతాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమల పంపిణీ

వనస్థలిపురం: గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కాలుష్య నివారణకు మట్టి గణపతులనే ప్రతిష్ఠించుకోవాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ సేవ ఇస్లావత్‌తో కలిసి వెంకటరమణ కాలనీలో పర్యటించి మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. ఆ కార్యక్రమంలో డీఈ కార్తీక్, నాయకులు హరిందర్‌రెడ్డి, భూపతిరెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మలక్‌పేట: విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి నింపాలని శ్రీచైతన్య స్కూల్స్ దిల్‌సుఖ్‌నగర్ జోనల్ ఏజీఎం సతీష్ అన్నారు. మూసారాంబాగ్ బ్రాంచీలో బుధవారం నిర్వహించిన స్పోర్ట్స్‌డేకు ఆయన హాజరై క్రీడా జ్యోతిని వెలిగించి ఆటలపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటలు ఆరోగ్యంతో పాటు దేహదారుఢ్యం, మానసికోల్లాసాన్ని ఇస్తాయన్నారు. విద్యార్థులకు ఆసక్తి ఉన్న క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో శిక్షణ ఇస్తే జీవితంలో మరింతా రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రిజ్వానా, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న పద్మజా రమణి

మండల ప్రత్యేకాధికారి పద్మజా రమణి

యాచారం: ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించొద్దని ప్రత్యేకాధికారి పద్మజారమణి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రజలు అంటు వ్యాధులకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ఆరోగ్య నివేదిక రూపొందించాలని తెలిపారు. తాగునీటి సరఫరా విషయంలో లీకేజీలు లేకుండా, కలుషీత నీరు సరఫరా కాకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. డ్రైనేజీ కాల్వలు నిండిపోయి దుర్వాసన, దోమల బెడద లేకుండా శుభ్రం చేయించాలని, నీటి ట్యాంకులను శుభ్రం చేసి, పైకప్పులు బిగించాలన్నారు. వర్షాలు కురుస్తున్న సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిర్వహణ లేక.. నిరుపయోగంగా..

- చెట్ల చాటున, బురదలో ఈవీ చార్జింగ్ పాయింట్ల ఏర్పాటు
- వాహనదారుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



కొత్తపేట మోహన్‌నగర్‌లో చెత్తలో ఏర్పాటు చేసిన వైనం

నాగోలు: పెరుగుతున్న ఇంధనధరలతో వాహనదారులు ఎలక్ట్రిక్ వాహనాలపై ఆసక్తి కనబరుస్తున్నారు. కాలుష్యాన్ని నియంత్రించడంలో ఎలక్ట్రిక్ వాహనాల కీలకపాత్ర పోషిస్తున్నాయి. దీంతో రోజు రోజుకు నగరంలో ఎలక్ట్రిక్(ఈవీ) వాహనాల సంఖ్య పెరిగిపోతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్ట్ కిందా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేసింది. ఎల్‌బీనగర్ మూడు సర్కిల్ పరిధిలో జీహెచ్ఎంసీ అధికారులు ఏర్పాటు చేసిన ఈవీ ఛార్జింగ్ పాయింట్లపై నిర్వహణ లేక నిరుపయోగంగా మారుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాకంగా తీసుకువచ్చిన ఈవీ ఛార్జింగ్ పాయింట్లపై అధికారులు అవగాహన కల్పించకపోవడంతో దిష్టి బొమ్మల్లా మారే పరిస్థితి ఏర్పడింది. ఛార్జింగ్ పాయింట్ ఎక్కడెక్కడ ఉన్నాయో తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఏర్పాటు చేసిన ఈవీ ఛార్జింగ్ పాయింట్లు జన సంచారం లేని చోటు, పార్కులు, నగరశివారు ప్రాంతాలలో ఏర్పాటు చేయడంతో నిరుపయోగంగా మారుతున్నాయి.

సూచికలు ఏర్పాటు చేస్తేనే..

ఎల్‌బీనగర్ పరిధిలో బండ్లగూడ జీఎస్ఐ వద్ద ఏర్పాటు చేసిన ఈవీ ఛార్జింగ్ పాయింట్లు వద్ద చెత్త చెదారం పేరుకుపోయింది. బండ్లగూడ విజయ గార్డెన్ పార్క్ వద్ద ఏర్పాట చేసిన ఈవీ ఛార్జింగ్ పాయింట్ వద్ద వర్షం వచ్చిన ప్రతిసారి నీట మునుగుతోంది. అధికారులు పట్టించుకోక పోవడంతో వాహనదారులు అక్కడి వచ్చి తిరిగి వెళ్తున్నారు. జనవాసాల వద్ద ఏర్పాటు చేయకుండా ప్రజలకు అందుబాటులో లేని ప్రాంతంలో ఏర్పాటు చేశారు. కొత్తపేట మోహన్‌నగర్ ఏర్పాటు చేసి ఛార్జింగ్ పాయింగ్ నిరుపయోగంగా మారింది. కొత్తపేట బీజేఆర్ భవనం, నాగోలు ఆర్టీఏ కార్యాలయం వద్ద, హయత్‌నగర్ పరిధిలో ఏర్పాటు చేసిన ఈవీ ఛార్జింగ్ పాయింట్ కొత్త మేరకు పనిచేసిన జీహెచ్ఎంసీ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో అవి కూడా మూత పడ్డాయి. ఉన్నతాధికారులు స్పందించి పని చేయని వాటిని వినియోగంలోకి తీసుకొచ్చి ఈవీ ఛార్జింగ్ పాయింట్‌లపై అవగాహన సదస్సులు నిర్వహించాంటున్నారు. ఏఏ ప్రాంతాల్లో ఉన్నాయో సూచిక బోర్డులు ఏర్పా టు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్లాట్ల పేరుతో మోసం

బాధితుల ఆందోళన

నాగోలు: ప్లాట్ల పేరుతో రూ. లక్షల్లో కట్టించుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా, ఇచ్చిన చెక్కులు బౌన్స్ అవుతున్నాయని బాధితులు ఎల్‌బీనగర్ కామినేని సమీపంలోని స్పెక్ట్రా రియల్ ఎస్టేట్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఎల్‌బీనగర్, హయత్‌నగర్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన పేద, మధ్య తరగతి ప్రజలు స్పెక్ట్రా రియల్ ఎస్టేట్‌లో వివిధ ప్రాంతాలల్లో ప్లాట్లు కొనుగోలు చేశారు. డబ్బులు వసూలు చేసి రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరవడంతో నిర్వాహకులు బాధితులకు గతంలో చెక్కులు ఇచ్చారు. సదరు సంస్థ ఇచ్చిన చెక్కులు అకౌంట్లో డబ్బులు లేకపోవడంతో బౌన్స్ అయ్యాయని బాధితులు పలుమార్లు కార్యాలయానికి వచ్చి ఆరా తీయగా ఎవరూ స్పందించకపోవడంతో బుధవారం ధర్నాకు దిగారు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడ ఉంటామంటూ నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ పోలీసులు అక్కడి చెరుకుని ఆందోళన చేస్తున్న వారిని అక్కడి నుంచి పంపిచారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్‌లోని స్పెక్ట్రా రియల్ ఎస్టేట్ కంపెనీ నిర్వాహకులు ప్లాట్లు పేరుతో వందలాది మందిని మోసం చేశారని వెంటనే వారిపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యాలయం వద్దకు వస్తే ప్రైవేట్ సెక్యూరిటీని ఏర్పాటు చేసుకుని బాధితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.